క్లుప్తంగా

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మండలంలోని చింతలపాలెంలో పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు




ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌శర్మ ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలు చెప్పండి పరిష్కరిస్తా..

● సైక్లింగ్ చేస్తూ సబ్ కలెక్టర్ త్రివినాగ్ పర్యటన



సైకిల్‌పై పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాగ్ పట్టణంలో ఆదివారం సైకిల్‌పై పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సాధారణ వ్యక్తిలా సైకిల్‌పై తిరుగుతూ హోటళ్లు, పండ్ల దుకాణాలకు వెళ్లారు. ఓ హోటల్లో టిఫిన్ చేస్తూ కార్మికుల ఇబ్బందులు తెలుసుకున్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన



సూచనలిస్తున్న కమిషనర్ నారాయణరెడ్డి

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉందని ఫిర్యాదులు రావడంతో కమిషనర్ నారాయణరెడ్డి స్పందించారు. ఆదివారం ఫాగింగ్ పనులను ప్రారంభించారు. ఎక్కువగా దోమల బెడద ఉన్న ప్రాంతాల్లో ముందుగా ఫాగింగ్ చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు ఉన్నారు.

పండగ చేద్దాం ప్రతిమలు సిద్ధం..

● గణేశ్ ఉత్సవాలకు ఊరూవాడా ఏర్పాట్లు
● జోరుగా వినాయక విగ్రహాల విక్రయాలు
● పల్లెలకు తరలుతున్న గణనాథులు



కొనకనమిట్లలో సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు

మార్కాపురం/కొనకనమిట్ల: వినాయక చవితి పర్వదినాన్ని ఈ నెల 27న ఘనంగా నిర్వహించేందుకు పట్టణాలతోపాటు పల్లెలు సిద్ధమవుతున్నాయి. వివిధ రూపాల్లో రూపొందించిన విగ్రహాలను కొనుగోలు చేసిన కమిటీ సభ్యులు గ్రామాలకు తరలిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో విగ్రహాలు పెద్ద ఎత్తులన ఊరూవాడా తరలించే అవకాశం ఉంది.

విక్రయాల సందడి

మార్కాపురం పట్టణంతోపాటు మండల కేంద్రాల్లో గణేష్ విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి.



మార్కాపురంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన గణేశ్ విగ్రహాలు

ఒక అడుగు ఎత్తు నుంచి పది అడుగులకు పైగా విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ఉత్సవ కమిటీలు ఆసక్తి చూపుతున్నాయి. విజయవాడ, నెల్లూరు, ఒంగోలు ప్రాంతాల నుంచి పలువురు వ్యాపారులు విగ్రహాలు తీసుకుకొచ్చి పట్టణాల్లో విక్రయిస్తున్నారు. మార్కాపురంలోని సీపీఐ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, రాయవరం, ఎస్‌వీకేపీ కాలేజీ, వై జంక్షన్, ప్రెస్‌క్లబ్ వద్ద వినాయకుని విగ్రహాలు విక్రయిస్తున్నారు. మార్కాపురం మండలం, తర్లుపాడు, పెద్దారవీడు మండలంలోని సుమారు 40 గ్రామాలకు చెందిన విగ్రహాలు కొనుగోలు చేసి ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్లలో మండపాలకు తరలిస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఒక్కో విగ్రహానికి రూ.1000 నుంచి రూ.1500 వరకు ధర పెంచి వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఆరున్నర అడుగుల వినాయక విగ్రహాలు రూ.15 వేల నుంచి రూ.20 వేల మధ్య విక్రయిస్తున్నారు. నంది వాహనం, హంస, మూషిక, నెమలి, గజ, సింహ వాహనంపై కొలుదీరిన గణనాథులను కొనేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు.

నిబంధనలు పాటించాలి

మార్కాపురం పట్టణంలో వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. డీజేలకు ఎలాంటి అనుమతి లేదు. రాత్రిపూట నిర్వాహకులు విగ్రహం వద్ద కాపలాగా ఉండాలి. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
– సీఐ సుబ్బారావు, మార్కాపురం

అనుమతి తప్పనిసరి

వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలి. మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు పోలీసుల అనుమతి తప్పనిసరి. కమిటీ సభ్యుల పూర్తి వివరాలతో సింగిల్ విండో విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
– ఎస్సై ప్రభాకరరెడ్డి, కొనకనమిట్ల

రోడ్లు బాగుపడేదెప్పుడో?

కొమరోలు/రాచర్ల:

కడప–అమరావతి రాష్ట్రీయ రహదారి గుంతలమయంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు 6 నెలల క్రితం తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన చోటే మళ్లీ గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమరోలు మండలంలోని పామూరుపల్లె గ్రామ సమీపంలో శివాలయం వద్ద భారీ గుంత ఏర్పడడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే, మండలంలోని అల్లినగరం గ్రామంలో రహదారిపై గుంతలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కొమరోలులోని సీసీ రోడ్డు కూడా గుంతలమయంగా మారింది. వర్షాలు పడితే నీరు చేరి గుంతలు కనిపించక వాహనాలు అదుపుతున్నాయి. రాచర్ల మండలంలోని చోళ్లవీడు గ్రామ సమీపంలోని చప్టా వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. చప్టా దిగువ భాగం కోతకు గురికావడంతో భారీ వాహనాల రాకపోకల సమయంలో పను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఆ రోడ్డుపై భారీ ప్రమాదం జరకకముందే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



కొమరోలు : అల్లినగరం గ్రామంలో ఏర్పడిన భారీ గుంత



చోళ్లవీడు వద్ద చప్టా దిగువన కోతకు గురైన భాగం



కొమరోలు : పామూరుపల్లె గ్రామసమీపంలో ఏర్పడిన భారీస్థాయి గుంత

వృథాగా తొట్లు.. లక్ష్యానికి తూట్లు



గొట్లగట్టు పొలాల్లో నీరు నింపని తొట్టి



తువ్వపాడు వద్ద పూర్తి చేయకుండా వదిలేసిన తొట్టి

కొనకనమిట్ల:

వేసవిలో గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు మంచినీటి తొట్లు నిర్మిస్తున్నట్లు గొప్పగా చెప్పిన కూటమి సర్కారు.. క్షేత్ర స్థాయిలో వాటి పురోగతిని గాలికొదిలేసింది. కొనకనమిట్ల మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా 13 గ్రామాల్లో 48 మంచినీటి తొట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.30 వేలు మంజూరు చేశారు. వీటిలో 8 తొట్లు సగం కూడా పూర్తి చేయకుండా వదిలేశారు. తువ్వపాడు సమీపంలో రహదారి పక్కనే ఉన్న పొలంలో ఏర్పాటు చేస్తున్న నీటి తొట్టి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఇదిలా ఉండగా పూర్తి చేసిన తొట్లలో నీరు నింపకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మొదట్లో కొన్ని రోజులు నీరు పెట్టి ఆ తరువాత వదిలేయడంపై పశుపోషకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముక్కు మూసుకో.. నీరు పట్టుకో!

పొదిలి: స్థానిక శివాలయం ఎదురుగా ఉన్న పంప్ హౌస్ వద్ద కుళాయి పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. పట్టణంలోని పలు ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వచ్చి మంచినీరు తీసుకెళ్తుంటారు. మురుగు కారణంగా దోమల బెడద అధికంగా ఉందని, దుర్వాసన వస్తోందని నీరు పట్టుకునేందుకు వచ్చిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వంతు వచ్చేంత వరకు వేచి ఉండాల్సి రావడంతో ఇబ్బందిగా ఉందని, అధికారులు స్పందించి కుళాయి పరిసరాలను బాగు చేయించాలని కోరుతున్నారు.



పంప్ హౌస్ కుళాయి వద్ద మురుగు

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● కమిటీల సభ్యులకు డీఎస్పీ నాగరాజు సూచన



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం టౌన్: ఈనెల 27 నుంచి ప్రారంభవుతున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ యు.నాగరాజు సూచించారు. ఆదివారం నెహ్రూ బజారులోని సాయి ఫంక్షన్ హాల్లో వినాయకచవితి ఉత్సవ కమిటీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మార్కాపురం సర్కిల్ పరిధిలో గణేశ్ మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసు, విద్యుత్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో డీజేలకు అనుమతి లేదని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సైతం అనుమతి తీసుకోవాలన్నారు. మండలపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రోజూ రాత్రి వేళ ఒకరు కాపలా ఉండాలని సూచించారు. మద్యం తాగి వినాయ కచవితి ఉత్సవాల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపం వద్ద అగ్నిమాపక నిరోధక సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రాంతాల వివరాలు తమకు ముందుగా తెలియజేస్తే మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో సీఐ సుబ్బారావు, సాయిబాబా ఆలయ కమిటీ కార్యదర్శి జి.హరిహరరావు, ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ పోలికలతో శ్రీకృష్ణుని విగ్రహం తగదు

● యాదవ సంఘాల నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న పీఎల్పీ యాదవ్, పక్కన బీసీ సంఘాల నాయకులు

మార్కాపురం: ఎన్‌టీ రామారావు పోలికలతో శ్రీకృష్ణుని విగ్రహాన్ని తయారుచేయడం తగదని బీసీ సంఘాల నాయకులు పీఎల్పీ యాదవ్, చిన్నయ్య ఖండించారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో హిందువులందరికీ ఆరాధ్య దైవమైనటువంటి శ్రీకృష్ణ పరమాత్ముడి విగ్రహాన్ని ఒక సినిమా హీరో పోలికలతో విగ్రహాన్ని తయారు చేసి గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ సంఘటన యాదవుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు, చిన్నయ్య గౌడ్, ఇల్లూరి రంగస్వామి గౌడ్, సుబ్బు, ఆర్ పురుషోత్తం, వంకేశ్వరం శ్రీనివాస్, బాల బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, నాగం వెంకటేష్ యాదవ్, ఎం.చెంచయ్య యాదవ్, లక్ష్మీనారాయణ, బాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గిద్దలూరు రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర లేబర్ ఫెడరేషన్ కమిషనర్ కార్యాలయం ముట్టడి పోస్టర్లను ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 15వ తేదీన రాష్ట లేబర్ ఫెడరేషన్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పథకాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు.. అధికారం చేపట్టి 15 నెలలు పూర్తవుతున్నా ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తింపజేయాలన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కార్మికులు ఐకమత్యంతో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.నరసింహులు, నారాయణ, బాబురావు, జి.వెంకటేశ్వర్లు, థామస్ తదితరులు పాల్గొన్నారు.



చప్టా నిర్మాణం కోసం తీసిన గుంత

చప్టా నిర్మాణ పనులు గాలికి..!

● ఆరు నెలలుగా ప్రజల ఇబ్బందులు

బేస్తవారిపేట:

స్థానిక పాత జేజీఎం స్కూల్ సమీపంలో మూడు రోడ్ల కూడలిలో నూతనంగా చప్టా నిర్మించేందుకు ఆరు నెలల క్రితం పంచాయతీ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. పునాది కోసం గుంత తవ్వించడంతోపాటు ఐరన్ రాడ్ బెండింగ్ చేయించి అక్కడే వదిలివేశారు. నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. మురుగు దిగువకు వెళ్లే మార్గం లేక డ్రైనేజీ నిండిపోయి సీసీరోడ్డుపై ప్రవహిస్తోంది. రోడ్డు మురుగుమయంగా మారడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగు కారణంగా దోమలు వృద్ధి చెంది రాత్రి వేళ నిద్ర కరువవుతోందని, జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డ్రైనేజీ నిండి సీసీ రోడ్డుపైకి చేరిన మురుగు



పొదిలిలో సైకిల్ తొక్కుతున్న సీఐ, ఎస్సై



కంభంలో సైక్లింగ్ చేస్తున్న సీఐ, ఎస్సై



మార్కాపురంలో సైకిల్ తొక్కుతున్న సీఐ, ఎస్సైలు

సైక్లింగ్‌తో ఆరోగ్యానికి మేలు

మార్కాపురం టౌన్/పొదిలి/కంభం: సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ వీలైనప్పుడు సైక్లింగ్ చేయాలని పోలీసుల అధికారులు సూచించారు. ఎస్పీ సూచన మేరకు ఆదివారం మార్కాపురం, పొదిలి, కంభం, ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులు, సిబ్బంది సైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. కంభం పోలీస్ స్టేషన్ ఆవరణలో యోగాసనాలు వేశారు. మార్కాపురంలో సీఐ పి.సుబ్బారావు, పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, పొదిలిలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన, కంభంలో సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.